సంచలన సాయంకాల పత్రిక
# సత్యం
https://www.satyamdaily.net/
శనివారం 14-12-2024
సంపుటి: 20 సంచిక: 222
పేజీలు: 4 వెల: రూ.1

## భార్యాభర్తలపై కత్తులతో దాడి

(సత్యంన్యూస్, టెక్కలి)

అన్నదమ్ముల మధ్య భూవివాదం నేపథ్యంలో జరిగిన ఘర్షణ భార్యాభర్తలపై కత్తులతో దాడికి దారితీసింది. తిర్లంగి గ్రామానికి చెందిన పట్టి రామ్మోహన్‌రావు, అతని భార్య రాజేశ్వరిపై అన్న జానకిరామయ్య, ఆయన కుమారుడు కలిసి కత్తులతో శనివారం దాడిచేయడంతో తీవ్ర గాయాలతో టెక్కలి జిల్లా ఆసుపత్రిలో చేరారు. స్థానికుల కథనం ప్రకారం పిట్ట రామ్మోహన్‌రావు, జానకి రామయ్య మధ్య గత కొన్నేళ్లుగా భూ వివాదం నగుస్తుంది. శనివారం ఉదయం పిట్ట జానకి రామయ్య పొలంలో రామ్మోహన్ సదరు భూమి తనకు చెందినదిగా బోర్డు పెట్టాడు. దీన్ని వ్యతిరేకించిన అన్న జానకిరామయ్య తనకు చెప్పకుండా బోర్డు పెట్టడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ కుమారుడితో కలిసి తమ్ముడు రామ్మోహన్‌రావు, ఆయన భార్య రాజేశ్వరిపై ఇంటికి వెళ్లి కత్తులతో దాడి చేశారు. స్థానికులు సహాయంతో ప్రభుత్వ ఆసుపత్రికి చేరిన రామ్మోహన్‌రావు దంపతులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.








# అసలెవర్రా మీరంతా?!



- జిల్లాలో రెండుచోట్ల దొంగనోట్ల ముఠా గుట్టురట్టు
- ఉభయగోదావరి జిల్లాల్లో మరో గుంపును అరెస్టు చేసిన పోలీసులు
- నర్సాపురం నుంచి నిందితుడ్ని తెస్తుండగా పోలీసులపై దాడి
- జి.సిగడాం నుంచి వెళ్లిన పోలీసులు నిందితులను తెస్తుండగా గ్రేట్ ఎస్కేప్

**జిల్లాలో జి.సిగడాం మండలంలో రూ.15 లక్షలు నకిలీ కరెన్సీని చెలామణికి తీసుకువెళ్తుండగా, శుక్రవారం ఎన్ని రాజేష్, గనగళ్ల రవికుమార్‌లను పోలీసులు అరెస్టు చేశారు. అదే సమయంలో మెళియాపుట్టి పోలీస్‌స్టేషన్ పరిధిలో రూ.57.25 లక్షలు నకిలీ నోట్లు, దాని ప్రింటింగ్‌కు ఉపయోగించే పరికరాలను స్వాధీనం చేసుకుని ఆరుగురు నిందితులను అరెస్ట్ చూపించారు టెక్కలి సబ్ డివిజన్ అధికారులు. అదే సమయంలో అంబేద్కర్ కోనసీమ జిల్లాలో నకిలీ కరెన్సీని చలామణి చేస్తున్న 12 మందిని అమలాపురం ఎస్పీ కార్యాలయంలో మీడియా ముందు ప్రవేశపెట్టారు. అసలు దొంగనోట్లు చలామణి ఎక్కువైపోతుందనే రూ.2వేల నోటును రద్దు చేశామని ప్రభుత్వం ప్రకటించిన తర్వాత కూడా చిన్నా చితకా నోట్లు నకిలీవి ముద్రించడం వెనుక ఎవరున్నారు? అసలు ఏం జరుగుతోంది? రాష్ట్రవ్యాప్తంగా నకిలీ నోట్లు చెలామణీ చేస్తున్న ముఠాకు మూలం ఒక్కచోటే ఉన్నట్లు అర్థమవుతుంది. అయితే అది ఒడిశా నుంచా? లేదా పాత ఉభయ గోదావరి జిల్లాల నుంచా అనేది తేలక ముందే ఖమ్మంలో కూడా వీటి మూలాలు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. దీంతో మన జేబులో ఉన్నది దొంగనోటా? అసలునోటా అన్నది కూడా చెప్పలేని పరిస్థితి ఏర్పడింది.**



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

జి.సిగడాంలో దొరికిన ఎన్ని రాజేష్, గనగళ్ల రవికుమార్‌లను విచారిస్తే.. ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల్లో దీని మూలాలు ఉన్నాయని పోలీసులు గ్రహించారు. అందులో భాగంగా వీరిచ్చిన సమాచారం మేరకు నర్సాపురం వెళ్లి రాపాక ప్రభాకర్ అలియాస్ ప్రతాప్‌రెడ్డి అనే వ్యక్తిని అదుపులోకి తీసుకొని రాజమండ్రిలో ఉన్న కృష్ణారావు అనే మరో వ్యక్తిని కూడా అరెస్టు చేయడానికి కారులో శుక్రవారం వచ్చారు. అయితే కృష్ణారావు ఆచూకీ లభించకపోవడంతో అక్కడి పోలీసులకు సమాచారమిచ్చి రాపాక ప్రభాకర్‌ను శ్రీకాకుళం తరలిస్తుండగా, దొంగనోట్ల గ్యాంగ్‌కు చెందిన వ్యక్తులు వాహనాల మీద వచ్చి జి.సిగడాం పోలీసుల కారు మీద దాడి చేసి అద్దాలు బద్దలుగొట్టి పోలీసుల అదుపులో ఉన్న రాపాక ప్రభాకర్‌ను తీసుకుపోయారు. పోలీసుల మీదే స్వయంగా దాడిచేసి, కారును అడ్డగించి అదుపులో ఉన్న నిందితుడ్ని పట్టుకుపోవడమంటే చిన్ననేరం కాదు. కానీ ఇందుకు పాల్పడ్డారంటే దొంగ నోట్లముఠా రాష్ట్రంలో గట్టిగా పాతుకుపోయిందని అర్థమవుతుంది.

జి.సిగడాం పోలీసుల మీద జరిగిన దాడికి సంబంధించిన సమాచారం అడుగుతారని రణస్థలం సర్కిల్‌లో పోలీసులు ఫోన్లు లిఫ్ట్ చేయడంలేదు. 'సత్యం' సేకరించిన ప్రాథమిక వివరాల మేరకు పోలీసుల కారు నుంచి విడిపించుకుపోయిన రాపాక ప్రభాకర్ అలియాస్ ప్రతాప్‌రెడ్డిది నర్సాపురం గ్రామానికి 10 కిలోమీటర్ల దూరంలో కొప్పార్రు గ్రామం. కానీ,



ఈయన రెడ్డి కాదని స్థానికులు 'సత్యం'కు సమాచారమిచ్చారు. ఇటువంటి పనులు చేసినప్పుడు అలియాస్‌గా చాలా పేర్లు మారుస్తుంటాడని తెలుస్తుంది.

అసలునోట్లు లక్ష ఇస్తే, నకిలీ నోట్లు రూ.5 లక్షలు తెచ్చుకునే అవకాశం ఉండటంతో రాష్ట్రవ్యాప్తంగా దందా ఈమధ్య కాలంలో బాగా పెరిగింది. గ్రామీణ ప్రాంతాలు ఎక్కువగా ఉండే శ్రీకాకుళం, భద్రాచలం, ఖమ్మం, నల్గొండ వంటి ప్రాంతాల్లో వారాంతపు సంతలు, పశువుల సంతలు ఇప్పటికీ జరుగుతున్నాయి. ఇక్కడే ఈ ఫేక్ కరెన్సీ చెలామణీలోకి వెళ్లిపోతుంది. చాలాకాలంగా దీని మీద ఎవరూ దృష్టి సారించకపోవడంతో నకిలీ దందా మూడు పువ్వులు, ఆరు కాయలుగా సాగుతూ వచ్చింది. దీంతో జిల్లాలో అసలునోట్లు కొన్ని ఇచ్చి నకిలీ నోట్లు అంతకు ఐదింతలు తెచ్చుకునే ముఠాకు ఆశ పెరిగింది. ఎవరికో నోట్లిచ్చే బదులు, ఆ నకిలీ నోట్లు తామే తయారు చేసుకుంటే పోలేదా అన్న భావన రావడంతో అటు ఒడిశా వైపు, ఇటు భద్రాద్రి వైపు జిల్లాలో నకిలీ నోట్ల ముఠా దృష్టి సారించింది. అందులో భాగంగానే పశ్చిమగోదావరి జిల్లా నర్సాపురం దగ్గర కొప్పర్రు గ్రామానికి చెందిన రాపాక ప్రభాకర్‌తోను, రాజమండ్రికి చెందిన కృష్ణారావుతోను మన జిల్లా లావేరుకు చెందిన ఎన్ని రాజేష్‌కు, నగరానికి చెందిన గనగళ్ల రవికి పరిచయాలు ఏర్పడ్డాయి. అక్కడి నుంచి నకిలీ నోట్లు తీసుకువచ్చి చలామణి చేస్తుండగానే పోలీసులకు చిక్కారు. నకిలీ నోట్లను తయారుచేసే ప్రింటర్, అందులో ఇంకు, స్కానర్‌లను భద్రాచలం నుంచి రాజేష్ తీసుకువచ్చినట్లు పోలీసులు ప్రకటించారు. సీన్ కట్‌చేస్తే.. మెళియాపుట్టిలో దొరికిన ఆరుగురు నకిలీ నోట్ల ముఠాతో పాటు అక్కడ కూడా ప్రింటర్, స్కానర్, ఇంకులను డీఎస్పీ మూర్తి స్వాధీనం చేసుకున్నారు. ఇక్కడ మరీ దరిద్రమేమిటంటే.. ఒడిశా నుంచి తెచ్చిన దొంగనోటుకే మళ్లీ సాన్ చేసి మరో దొంగనోటును సృష్టించి చలామణి చేస్తుండగా దొరికిపోయారు. జి.సిగడాంలో ఎన్ని రాజేష్ గ్యాంగు నుంచి అమలాపురం దగ్గర రాజోలులో దొరికిపోయిన ముఠావరకు అందరూ బ్యాంకుకు డిపాజిట్ చేసిన సందర్భంలోనే చిక్కారు. కానీ గ్రామాల్లో అభయం శుభం తెలియని వృద్ధులు ఈ నోట్లు తీసుకోవడం ద్వారా మోసపోవడంతో పాటు స్టేషన్ల చుట్టూ తిరగాలని, వీరిని మాటువేసి పట్టుకున్నారు. అంబేద్కర్ కోనసీమ జిల్లాలో బ్యాంకులో డిపాజిట్ చేస్తున్నప్పుడు పట్టుకోగా, మెళియాపుట్టిలలో కూడా ఓ వృద్ధ మహిళ నుంచి రూ.5వేలు అప్పు తీసుకొని, ఆమెకు తిరిగి చెల్లించినప్పుడు ఫేక్ కరెన్సీ ఇవ్వడం, ఆమె బ్యాంకులో డిపాజిట్‌కు వెళ్తే.. అవి ఫేక్ అని తేలడంతో ముసలమ్మను పట్టుకొని మొత్తం డొంకను కదిలించారు టెక్కలి డీఎస్పీ. మెళియాపుట్టి నకిలీ నోట్ల స్కామ్‌లో దొరికినవారు కానీ, జి.సిగడాంలో కారుతో సహా దొరికిన ఇద్దరు కానీ చిన్నింటోళ్లేం కాదు. వీరి గతచరిత్రా ఘనమే.

- మిగతా 4లో



• ఎడిటోరియల్

# అవినీతిలో మన ర్యాంక్ పెరిగింది..!

అవినీతి సూచికలో భారత్ ర్యాంక్ భారీగా పతనమవడాన్ని గమనిస్తే అనేక ప్రశ్నలు తలెత్తుతాయి. అవినీతికి వ్యతిరేకంగా దేశంలో 2012లో ఉద్యమం ప్రారంభమైంది. అప్పుడు అదే ప్రధానాంశంగా నిలిచింది. పరిపాలనలో పెచ్చరిల్లిన అవినీతి జాడ్యంపై చర్చోపచర్చలు సాగాయి. మరి గడచిన పుష్కర కాలంలో దేశంలో అవినీతి తగ్గిపోయిందా? పొరుగు దేశాలైన చైనా, భూటాన్, సింగపూర్, మలేసియా ఈ సమస్యను ఎదుర్కోవడంలో మంచి విజయాలు సాధిస్తే మనం ఎందుకు విఫలమవుతున్నాము? ఏ దేశ చరిత్ర చూసినా.. భారత్‌లో అవినీతిపై గత సంవత్సరం టీఐ సంస్థ ఓ అధ్యయనం నిర్వహించింది. ఇందుగలడందు లేడన్నట్లు దాదాపు అన్ని ప్రభుత్వ శాఖలు.. పోలీస్, రెవెన్యూ, దిగువ స్థాయిలోని న్యాయ వ్యవస్థ, విద్య, ఇంజినీరింగ్.. ఇలా అన్ని శాఖలూ అవినీతి నిలయాలుగా మారాయని టీఐ స్పష్టం చేసింది. సంపన్న దేశాలతో పాటు వర్ధమాన దేశాలు కూడా అవినీతి సమస్యను ఎదుర్కొంటూనే ఉన్నాయి. అమెరికాలోని పలు రైల్‌రోడ్డు ప్రాజెక్టుల్లో అవినీతి చోటుచేసుకుంది. నిషిద్ధ కాలంలో అమెరికా పోలీసు వ్యవస్థకు అవినీతి చెద పట్టింది. ఇక జపాన్‌లో లాక్‌హెడ్ విమాన కాంట్రాక్టులు పొందేందుకు భారీగా డబ్బు ముట్టజెప్పారు. ఈ కుంభకోణం అప్పటి ప్రధాని కాకీ తనాకా అరెస్టుకు దారితీసింది. ఆయన నాలుగు సంవత్సరాలు జైలు జీవితం గడిపారు. జర్మనీ రక్షణ మంత్రిపైన, నెదర్లాండ్స్ రాకుమారుడిపైన వచ్చిన అవినీతి ఆరోపణలు వారి రాజకీయ జీవితాన్ని బాగా దెబ్బతీశాయి. అప్పటి నుంచి చాలా దేశాలు రక్షణ చర్యలు చేపట్టి తమ సమాజాలకు అవినీతి చీడ అంటకుండా జాగ్రత్త పడ్డాయి. దిగజారుడే వివిధ దేశాల్లో అవినీతి ఏ మేరకు ఉన్నదనే విషయాన్ని గుర్తించేందుకు ప్రామాణికమైన పద్ధతి అంటూ ఏదీ లేదు. అయితే ప్రపంచంలో ప్రధానంగా రెండు సంస్థలు అవినీతిపై సమాచారాన్ని ప్రచురిస్తున్నాయి. అవే ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్నేషనల్ (టీఐ), ప్రపంచబ్యాంక్. ప్రపంచబ్యాంక్ తన పరిపాలనా సూచికలో భాగంగా అవినీతి సమాచారాన్ని అందిస్తోంది. 2023లో అవినీతి సూచికలో భారత్ స్థానం 93 (మొత్తం దేశాలు 180). 2018లో ఈ ర్యాంక్ 85గా ఉండేది. 2016లో మన దేశం 79వ ర్యాంకులో ఉంది. అంటే ప్రతి సంవత్సరం అవినీతిలో భారత్ ర్యాంక్ దిగజారుతోందే తప్ప మెరుగుపడుతోంది లేదు. దీనిని బట్టి అర్థమవుతోంది ఏమిటంటే గత కొన్ని సంవత్సరాల కాలంలో దేశంలో అవినీతి పెరగడమో లేదా ఇతర దేశాలు తమ పరిస్థితిని మెరుగుపరచుకోవడమో జరిగింది. ఫలితమివ్వని ఉద్యమం అవినీతిని అదుపు చేయడంలో వైఫల్యం చెందడం మరో కోణం నుంచి కూడా ఆందోళన కలిగిస్తోంది. 2012-13లో అవినీతిపై పెద్ద ఎత్తున ఉద్యమం జరిగింది. ప్రజా బాహుళ్యం కలిగిన శక్తివంతులైన నేతలు అందులో భాగస్వాములయ్యారు. రాజకీయాలలో సమూల మార్పులు చేపట్టాల్సిన అవసరాన్ని ప్రజలకు నొక్కి చెప్పారు. అవినీతి కేసుల విచారణ కోసం లోకాయుక్తతో పాటు లోక్‌పాల్ తరహా వ్యవస్థ ఉండాలన్న చర్చ జరిగింది. అయితే అది కార్యరూపం దాల్చలేదు. ప్రస్తుతం కర్నాటకలో మినహా మరెక్కడా లోకాయుక్త లేదు. వైఫల్యానికి కారణమేమిటి? అవినీతిని అరికట్టడంలో భారత్ ఎందుకు విఫలమవుతోంది? ఎన్నికలు వచ్చాయంటే రాజకీయ పార్టీలు కోట్లాది రూపాయలు ఖర్చు పెడతాయి. రాజకీయ పార్టీలకు ప్రైవేటు రంగం విరాళాలు అందిస్తుంది. ఇక్కడే క్విడ్ ప్రోకో మొదలవుతుంది. తమకు భారీగా వివరాలు ముట్టజెప్పే కంపెనీలు, సంస్థలకు పాలకులు వివిధ కాంట్రాక్టులు కట్టబెడుతుంటారు. సెంటర్ ఆఫ్ మీడియా స్టడీస్ అంచనా ప్రకారం 2019 లోక్‌సభ ఎన్నికల్లో వివిధ పార్టీలు కలిసి రూ.50వేల కోట్లు ఖర్చు చేశాయి. ఇటీవలి సార్వత్రిక ఎన్నికల్లో ఈ వ్యయం లక్ష కోట్లకు చేరిందని అంచనా. ఇదంతా రాజకీయ నాయకులు సంపాదించిన అవినీతి సొమ్మే. సామాన్యులు తమ అవసరాల కోసం అధికారులు, ప్రభుత్వ సిబ్బందికి లంచాలు, బహుమతులు సమర్పించుకోవడం సర్వసాధారణమై పోయింది. బడాబాబులు కాంట్రాక్టులు పొందేందుకు అధికార గణానికి భారీగానే సొమ్ము ముట్టజెబుతుంటారు. అందుకే అధికారుల దృష్టంతా కాంట్రాక్టులు, ప్రాజెక్టుల పైనే ఉంటుంది. పెద్ద ఎత్తున లంచాలు అందుకునే అవకాశం వాటిలోనే ఉంటుంది మరి. పైగా పట్టుబడే అవకాశాలు పెద్దగా ఉండవు. అభివృద్ధికి ప్రైవేటు పెట్టుబడులు అవసరమే. అయితే ఈ తరహా పెట్టుబడుల్లో అవినీతికి ఆస్కారం లేకుండా చేసినప్పుడే దేశంలో సంపద పెరుగుతుంది.

## సాఫ్ట్‌బాల్ పోటీలకు జిల్లా విద్యార్థులు ఎంపిక

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

జమ్మూలో ఈనెల 18 నుంచి జరగనున్న జాతీయ స్థాయి సబ్ జూనియర్ సాఫ్టబాల్ పోటీలకు జిల్లా విద్యార్థులు ఎంపికయ్యారు. బాలుర జట్టులో కేశవరావుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన మెట్ట హర్షవర్ధన్, పూజారి కళ్యాణరామ్, చింతాడ జస్వంత్ ఎంపిక అయినట్లు జిల్లా సాఫ్టబాల్ అధ్యక్షులు కలిదిండి నరసింహా రాజు, సెక్రటరీ సిగిలిపెల్లి లక్ష్మీదేవిలు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను మండల అగ్రికల్చర్ ఆఫీసర్ ఎం సురేష్ ఎంపీటీసీ సూర జగదీష్, మాజీ సర్పంచ్ పొందూరు భీమరావు ఎస్ఎంపీ చైర్మన్ అన్నెపు లక్ష్మీనారాయణ ప్రధానోపాధ్యాయులు బి వి సాయిరాం గారు పీడీ ఎం వి రమణ, పీఈటీ జి.మల్లేష్, జనసేన మండల అధ్యక్షులు తమ్మినేని శ్రీను, ఉపాధ్యాయలు అభినందించారు.



## మున్సిపల్ కార్మికుల సమస్య పరిష్కరించండి



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

మున్సిపల్ అధికారులు కార్మికులకు పెంచిన మస్టర్ పాయింట్లను తగ్గించి సమస్య పరిష్కారం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా ఉపాధ్యక్షులు అరుగుల.గణేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్. బలరాం కోరారు 2వ రోజు మున్సిపల్ కార్మికులకు పెంచిన మస్టర్ పాయింట్లను తగ్గించాలని, అధికారుల వేధింపులు ఆపాలని, యూనియన్‌తో చర్చలు జరిపి సమస్య వెంటనే పరిష్కరించాలంటూ 2వ రోజు ఏపీ మున్సిపల్ వర్కర్స్ &ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో శనివారం శ్రీకాకుళం నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద గాంధీ విగ్రహం ఎదుట ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో కళ్యాణ.రాజు,ఆకుల.శంకరరావు, ఏ.రాము, డి.యుగంధర్, ఏ.శేఖర్, ఏ.జనార్దన్, ఏ.గురుస్వామి, జె. మాధవి. ఏ.రాజేశ్వరి, పార్వతి, ఈశ్వరమ్మ,డి.చిట్టి తదితరులు పాల్గొన్నారు.

## విశాఖ పాల సేకరణ ధర పెంచాలి



(సత్యంన్యూస్, రణస్థలం)

విశాఖ డెయిరీ తగ్గించిన ఆవుపాల సేకరణ ధర వెంటనే పెంచాలని, పాలకు గిట్టుబాటు ధర ఇవ్వాలని కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వెలమల రమణ డిమాండ్ చేశారు. వేల్పురాయి గ్రామంలో ఆంధ్రప్రదేశ్ పాల రైతుల సంఘం ఆధ్వర్యంలో ఆవుపాల సేకరణ ధర తగ్గించడాన్ని నిరసిస్తూ పాలరైతులు ధర్నా నిర్వహించారు.

# మధ్యతరగతికి శుభవార్త ఎప్పుడు!

**- ఎంఐజీ లేఔట్ లో డబ్బులు చెల్లించిన వారందరూ ఆశతో ఎదురుచూపులు**



(సత్యంన్యూస్, పలాస)

పట్టణాలలోని మధ్య ఆదాయ వర్గాల సొంత ఇంటి కల సాకారం కానుందని గత ప్రభుత్వం అసంపూర్ణంగా నిలిపివేసిన ఎంఐజీ లేఔట్ల పెండింగ్ పనులను పూర్తిచేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా రాష్ట్రప్రభుత్వం పలాస పట్టణానికి దగ్గరలో కూడా లేఅవుట్లు వేయడం ప్రారంభించింది. పలాసకు అతి సమీపంలో జాతీయ రహదారికి అనుకుని బొడ్డపాడు వద్ద శ్రీకాకుళం అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ (సుడా ) ఫ్లాట్లకు మధ్యతరగతి వారు దరఖాస్తులు చేసుకొని ఇప్పటికే చాలా కాలం అవుతోంది,తమ సొంత ఇంటి కల ఎప్పుడు నెరవేరుతుందో అని ఎదురుచూపులే అవుతున్నాయి. ఇప్పటికే చాలా వరకు ప్లాట్లు బుకింగ్ అయ్యాయి అని అధికారులు చెబుతున్నప్పటికీ ఎందుకు మరి ఎవరి ప్లాట్స్ వారికి లాటరీ విధానంలో కేటాయించలేదొ ఎవరికి అర్థం కాని పరిస్థితి కనిపిస్తోంది. ఒకవైపు చిరు ఉద్యోగులు లోన్ తీసుకొని మరి 10 శాతం కట్టడంతో మిగతా డబ్బులు ఏమి చేయాలో అర్థం కానిది పరిస్థితి నెలకుంది. తమ చేతికి ల్యాండ్ రాకుండానే తీసుకున్న లోన్ కు వడ్డీ కట్టడం అవుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు, ఇప్పటికైనా అధికారులు మరియు పలాస శాసనసభ సభ్యులు గౌతు శిరీష,సూడా విసి ఆరా తీసి ఎవరికి రావలసిన ప్లాట్లు వారికి వీలైనంత త్వరగా కేటాయించేలా చేస్తారని ఇప్పటికే అడ్వాన్స్ కట్టిన మధ్య తరగతి ప్రజలు కోరుకుంటున్నారు.

## సహస్ర పూర్ణచంద్ర మహోత్సవం



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

పీఎన్ కాలనీలోని వరసిద్ధి వినాయక పంచాయతన దేవాలయంలో శనివారం ప్రారంభమైన సహస్ర పూర్ణ చంద్ర దర్శన శతాభిషేక మహోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే గొండు శంకర్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్తలు, పండితులు స్వాగతం పలికి వేదమంత్రాలతో అర్చనలు చేసి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సహస్ర పూర్ణచంద్ర దర్శన మహోత్సవ కార్యక్రమం శని, ఆది, సోమ మూడు రోజుల పాటు పూజాకార్యక్రమాలు నిర్వహించనున్నారని ప్రత్యేక పూజలులో కూర్చున్న డాక్టర్ నిక్కు అప్పన్నదంపతులు, వేదపండితులు నిర్వాహకులు తెలియజేశారు. ఈ పూజ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు, నిర్వాహకులు, స్థానిక కూటమి నాయకులు, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.




# అన్నీ మిస్!

ఒకప్పుడు తెలుగులో బ్లాక్ బస్టర్లు అందుకున్న తమిళ నటుడు సిద్దార్థ్.. ఆ తర్వాత వరుస ఫ్లాపులతో ఇక్కడి నుంచి అదృశ్యమయ్యాడు. కొన్నేళ్ల నుంచి అతను తమిళ అనువాదాలతో తెలుగు ప్రేక్షకులను పలకరిస్తున్నాడు. కానీ సరైన ఫలితం దక్కడం లేదు. తనకు గతంలో బాగా కలిసొచ్చిన లవ్ స్టోరీ జానర్లో అతను నటించిన చిత్రం.. మిస్ యు. 'నా సామి రంగ'తో మంచి పేరు సంపాదించిన ఆషికా రంగనాథ్ ఇందులో తనకు జోడీగా నటించింది. ఈ రోజే ప్రేక్షకుల ముందుకు వచ్చిన 'మిస్ యు' ఏమేర మెప్పించిందో చూద్దాం పదండి.

**సాంకేతిక వర్గం:** విషయం లేని సినిమాకు ఎంత పేరున్న టెక్నీషియన్లు పని చేసినా పెద్దగా ఫలితం ఉండదనడానికి 'మిస్ యు' రుజువు. 'రన్ రాజా రన్'తో ఒక ఊపు ఊపిన జిబ్రాన్.. 'మిస్ యు'లో మినిమం ఇంపాక్ట్ చూపించలేకపోయాడు. పాటలు.. నేపథ్య సంగీతం పూర్తిగా తేలిపోయాయి. మంచి పాటలు ఇచ్చే స్కోప్ కూడా ఈ కథ అతడికి ఇవ్వలేదనే అనిపిస్తుంది. వెంటకేష్ ఛాయాగ్రహణం పర్వాలేదు. నిర్మాణ విలువలు ఓకే. కథకుడు-దర్శకుడు రాజశేఖర్.. ఒక నిస్సారమైన స్క్రిప్టును అంతే డల్లుగా తెరపై ప్రెజెంట్ చేశాడు. అతడి రచన-దర్శకత్వ ప్రతిభ గురించి చెప్పడానికి ఏమీ లేదు.

హనుమాన్‌లో ముందుగా విలన్ని పరిచయం చేశాక.. ఆరంభ సన్నివేశాల్లోనే హనుమంతుడి భారీ రూపాన్ని.. దాని చుట్టూ ఒక అందమైన ప్రపంచాన్ని చూపించి ప్రేక్షకులకు మంచి మూడ్ సెట్ చేస్తాడు ప్రశాంత్ వర్మ. తర్వాత హీరో పరిచయ సన్నివేశాలు.. అంజనాద్రి గ్రామంలో వ్యవహారాలతో కథనం కొంచెం నెమ్మదిస్తుంది. కానీ మరి ఆలస్యం చేయకుండా కథను మలుపు తిప్పేశాడు దర్శకుడు. హీరో హనుమంతుడి తాలూకు అద్భుత శక్తిని చేజిక్కించుకున్నాక వచ్చే ఫాంటసీ సన్నివేశాలు మంచి వినోదం పంచుతాయి. ఇక్కడి నుంచి కథనం చకచకా సాగిపోతుంది. హీరో తన శక్తిని చూపించే యాక్షన్ ఘట్టాలు గమ్మత్తుగా అనిపిస్తాయి. విజువల్ ట్రీట్ అనిపించేలా తీర్చిదిద్దిన ఇంటర్వెల్ ఎపిసోడ్ కూడా మంచి కిక్ ఇస్తుంది. ఉదాహరణకు హనుమంతుడి భారీ రూపం.. మనుషుల్ని కొడితే ఎగిరి ఆ భారీ హనుమంటుడి ముందు గాలిలోకి ఎగిరే దృశ్యం.. హీరో హెలికాప్టర్‌ను చెట్టు వేరుతో లాగి పడేసే లాంటి సన్నివేశాలు.. పైపై మెరుగులు ఏమి కావు. తెరమీద అవి విజువల్ ట్రీట్ అనిపించేలా.. వాటిని చూస్తూ గూస్ బంప్స్ తెచ్చుకునే డిజైన్ చేసిన విధానం హనుమాన్ మూవీలో మేజర్ హైలైట్.

**నటీనటులు:** 'మిస్ యు' చూస్తున్నంతసేపు సిద్ధు ఏం చూసి ఈ కథను ఒప్పుకున్నాడనే సందేహం కలుగుతుంది. తనకేదో ప్రత్యేకమైన టేస్టు ఉన్నట్లుగా అతను మాట్లాడుతుంటాడు. ఒకప్పుడు అది నిజం కూడా. కానీ కథల ఎంపికలో అతడి జడ్జిమెంట్ పూర్తిగా దెబ్బ తిందని 'మిస్ యు' రుజువు చేస్తుంది. నటుడిగా కూడా సిద్ధు కొత్తగా ఏమీ ట్రై చేసింది లేదు. ఇంకా లుక్స్ బాగా మెయింటైన్ చేయడం తప్పితే అతను ఏ రకంగానూ మెప్పించలేదు. తన పాత్ర.. నటన అన్నీ చాలా సాధారణంగా అనిపిస్తాయి. 'నా సామి రంగ'లో ఆషికాను చూసి నోరెళ్లబెట్టిన వాళ్లు.. ఈ సినిమా చూసి షాకవుతారు. ఆమె పాత్ర అంత పేలవంగా అనిపిస్తుంది. తన స్క్రీన్ ప్రెజెన్స్ కూడా అంత బాగా అనిపించదు. తనను చూపించిన తీరే బాగా లేదు. హీరో స్నేహితుడి పాత్రలో కరుణాకరన్ పర్వాలేదు. జయప్రకాష్.. శరత్ లోహితశ్వ లాంటి ఆర్టిస్టులు ఏమాత్రం తమ ప్రత్యేకతను చూపించలేని విధంగా వారి పాత్రలు తయారయ్యాయి.

**కథ:** వాసు (సిద్దార్థ్) ఒక ప్రమాదంలో మెదడుకు దెబ్బ తగిలి తన గతంలో జరిగిన చాలా విషయాలను మరిచిపోతాడు. అతణ్ని తల్లిదండ్రులు జాగ్రత్తగా కాపాడుకుంటూ వస్తుంటారు. ఇలాంటి స్థితిలో అనుకోకుండా ఓ మిత్రుడి పరిచయంతో తనతో పాటుగా బెంగళూరుకు వెళ్తాడు వాసు. అక్కడ ఆ ఫ్రెండు అపార్ట్మెంట్లో ఉంటూ తన రెస్టారెంట్లోనే పని చేస్తున్న వాసుకు మంజు (ఆషికా రంగనాథ్)ను చూసి తొలి చూపులోనే ప్రేమిస్తాడు. తనను ఇంప్రెస్ చేయడానికి ప్రయత్నించినా పట్టించుకోదు. కానీ ఒక రోజు ధైర్యం చేసి తన ప్రేమను ఆమెకు చెప్పేస్తాడు. కానీ ఆమె అతడి ప్రేమను అంగీకరించదు. తన తల్లితో పాటు స్నేహితులకు ఆ అమ్మాయి గురించి చెప్పి ఎలాగైనా పెళ్లికి ఒప్పించాలనుకుంటాడు వాసు. కానీ ఆ అమ్మాయి ఫొటో చూసి వాళ్లంతా షాకవుతారు. అప్పటికే వాసు జీవితంలో ఆమె ఉందని.. తనకున్న మెమొరీ లాస్ సమస్యతో ఆమె గురించి మరిచిపోయాడని తెలుస్తుంది. ఇంతకీ మంజుతో వాసుకున్న సంబంధమేంటి.. వీళ్లిద్దరి మధ్య ఏం జరిగింది.. ఆమె గురించి వాసుకు మళ్లీ ఏమైనా గుర్తొచ్చిందా.. చివరికి వీళ్లిద్దరి బంధం ఏ తీరానికి చేరింది.. అన్నది మిగతా కథ.

**కథనం- విశ్లేషణ:**

తన సినిమా ప్రమోషన్లకు వచ్చిన ప్రతిసారీ ప్రేమకథ చేయమని ప్రేక్షకులు అడుగుతున్నారని.. వాళ్లు కోరినట్లే ఆ జానర్లో సినిమా చేశానని.. ఇప్పుడు దీన్ని ఆదరించకపోతే మళ్లీ ప్రేమకథ చేయను అన్నట్లుగా మాట్లాడాడు 'మిస్ యు' సినిమా ప్రమోషన్లలో హీరో సిద్ధార్థ్. ఐతే 'మిస్ యు' చూశాక ఇది ప్రేమకథ అంటే ఒప్పుకోవడానికి మనసు అంగీకరించదు. అసలు ప్రేమ భావనలే కలిగించని సోల్ లెస్ లవ్ స్టోరీ ఇది. ప్రేమ.. ఎడబాటు.. మళ్లీ ప్రేమ.. ఈ ఫార్మాట్లో చాలా మామూలుగా సాగిపోయే ఈ ప్రేమకథ ఒక్కటంటే ఒక్క సన్నివేశంలో కూడా ప్రేక్షకులకు ఫీల్ కలిగించదు. 'హాయ్ నాన్న'లో ప్రమాదంలో మెమరీ లాస్ కు గురయ్యే హీరోయిన్ పాత్రను హీరోగా మార్చి.. ఒక క్రైమ్ ఎలిమెంట్ ఏదో జోడించి దర్శకుడు ఈ కథతో ప్రేక్షకులను ఆశ్చర్యపరచాలని చూశాడు కానీ.. తెర మీద ఒక్కటంటే ఒక్క సన్నివేశం ప్రేక్షకులను సర్ప్రైజ్ చేయలేకపోయింది. తెర మీద ఏదో జరిగిపోతున్నట్లు బ్యాగ్రౌండ్ స్కోర్ ద్వారా ఫీల్ తీసుకురావడానికి ప్రయత్నించారు తప్పితే.. కథాకథనాల్లో ఏమాత్రం ప్రత్యేకత లేని అతి సాధారణమైన సినిమా 'మిస్ యు'. ఒక లవ్‌స్టోరీలో ఓ జంట ఒక్కటవుతుంటే ప్రేక్షకులకు ముచ్చటేయాలి. వాళ్లు విడిపోతుంటే వారి గుండెలు కలుక్కుమనాలి. వాళ్లు మళ్లీ కలవాలనే తపన కలగాలి. 'మిస్ యు' సినిమా ఏ దశలోనూ ఈ రకమైన భావనలు కలిగించదు. అసలు హీరో హీరోయిన్ల మధ్య గొడవతో మొదలయ్యే ఈ ప్రేమకథ అక్కడి నుంచి ముందుకే కదలదు. ఇటు హీరో.. అటు హీరోయిన్ ఒకరినొకరు అసహ్యించుకోవడమే చూస్తాం తప్ప.. వారి మధ్య ప్రేమంటూ ఏమీ కనిపించదు. హీరోయిన్ చూసిన ఒక హత్యకు సంబంధించి కేసు పెడదాం రా అంటాడు హీరో. ఆమె నో అంటుంది. అంతే.. విడిపోదాం అంటాడు. విడిపోతారు కూడా. మళ్లీ వీళ్లిద్దరూ తిరిగి కలిసే సన్నివేశాలైనా బలంగా రాసుకున్నారా అంటే అదీ లేదు. ఒకప్పుడు ప్రేమకథలకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచిన హీరో.. సిద్దార్థ్. అలాంటి హీరోతో ఆషికా రంగనాథ్ లాంటి అందమైన అమ్మాయి జోడీ కడితే.. ఓ మోస్తరు కథతో అయినా ప్రేక్షకులను ప్రేమ మైకంలో ముంచెత్తొచ్చు. కానీ 'మిస్ యు' అంటూ డెప్త్ ఉన్న టైటిల్ పెట్టి దర్శకుడు రాజశేఖర్ చాలా సాధారణమైన కథను నరేట్ చేశాడు. హీరోకు మెమొరీ లాస్ ప్రాబ్లం పెట్టి కథలో ఉత్కంఠ రేకెత్తించాలని చూశాడు కానీ.. అది ఏమాత్రం వర్కవుట్ కాలేదు. కథను ముందు వెనుక చెబుతూ .. స్క్రీన్ ప్లేలో వైవిధ్యం చూపించాలని ప్రయత్నిస్తే అది గందరగోళంగా తయారైంది. తెర మీద అసలేం జరుగుతోందో తెలియని అయోమయంలో ప్రేక్షకులు పడిపోతారు. హీరో హీరోయిన్ల మధ్య బంధాన్ని తెలియజేసే ట్విస్టు దగ్గర ప్రేక్షకులు ఆశ్చర్యపోవాలి కానీ.. ఏ స్పందనలూ లేకుండా నిస్తేజంగా మారిపోయారంటే దర్శకుడు ఈ కథను ఎంత నిరాసక్తంగా నరేట్ చేశాడో అర్థం చేసుకోవచ్చు. ఇటు ప్రేమ సన్నివేశాలూ పండక.. అటు క్రైమ్ ఎలిమెంట్ కూడా తేలిపోయి.. 'మిస్ యు' ప్రేక్షకుల సహనానికి పరీక్ష పెడుతుంది. 'చిన్నా' లాంటి సినిమాల్లో మెప్పించిన సిద్ధు.. ఈ సోల్ లెస్ లవ్ స్టోరీలో మాత్రం క్లూ లెస్ గా కనిపించాడు. అతడితో పాటు ఆషికాను కూడా దర్శకుడు వేస్ట్ చేశాడు. సిద్ధును ప్రేమకథల్లో చూడాలనుకుంటే.. నువ్వొస్తానంటే నేనొద్దంటానా లాంటి సినిమాలను రివైండ్ చేసుకోవచ్చు కానీ.. 'మిస్ యు' జోలికి మాత్రం వెళ్లకపోతే మంచిది.

- తుపాకి.కామ్ సౌజన్యంతో...



# హీరోల అత్యాశ ఆగడాలకు చెక్ పెట్టాలి!

**ఒక్క సంవత్సరం తాము పండించిన ధాన్యానికి తామే ధర నిర్ణయించుకుంటామని రైతులు అంటే ఈ ప్రభుత్వాలు ప్రత్యేక అనుమతులు ఇస్తాయా? ఆ ఘోరం జరిగిన 9 రోజులకి అల్లు అర్జున్‌ని పోలీసులు అరెస్ట్ చేశారు. ఆ సంఘటనకి బాధ్యులుగా గుర్తించబడిన మిగతా అందరి కంటే ఆయన పాత్రే నిస్సందేహంగా పెద్దది. తన వంటి మాస్ స్టార్ సెలబ్రిటీ తగిన జాగ్రత్తలు లేకుండా బహిరంగంగా బైటకి వస్తే పబ్లిక్ ఎంతగా డిస్టర్బ్ అవుతుందో తెలియనంత అమాయకుడు కాదు ఆయన. అప్పటికే ఏపీ ఎన్నికల సందర్భంగా ఆయనకొక చేదు అనుభవం వున్నది. విదేశీ గడ్డల మీద కూడా అంతర్జాతీయ క్రికెట్ మాచెస్లో విదేశీ ఆటగాళ్లు కూడా 'తగ్గేదేలే' అనే మేనరిజం ప్రదర్శిస్తూ సెలబ్రేట్ చేసుకుంటారంటే, ప్రధాని మోడీ కూడా "శ్రీవల్లి" పాటకి డాన్స్ చేస్తున్నట్లు మీంస్ క్రియేట్ చేశారంటే, దేశం మొత్తంలోని అన్ని "సినిమా వుడ్స్" లోనూ అత్యధికంగా 300 కోట్ల రూపాయిలు పారితోషికంగా తీసుకుంటున్నాడంటే... తాను ఏ స్థాయిలో పాపులరో, ఐమాక్స్ వంటి థియేటర్లలో కాకుండా తానో మామూలు థియేటర్లో ప్రత్యక్షం ఐతే జనం ఎంత విరగబడతారో అల్లు అర్జున్ కి తెలియదా? తనని చూడటానికి జనంలో తొక్కిసలాట జరగాలని, ఓ మనిషి ప్రాణం పోవాలని, ఎందరో గాయపడాలని ఆయన కోరుకోకపోవచ్చునేమో కానీ బాధ్యతగా ఆలోచించి వుంటే ఆ దారుణం జరిగేదే కాదు.**

థియేటర్ యాజమాన్యం నిర్లక్ష్యం, పోలిసు వైఫల్యం కూడా ఖచ్చితంగా వున్నాయి. థియేటర్ యాజమాన్యం పోలిసులకు అల్లు అర్జున్ రాక గురించి ముందుగా సమాచారం ఇచ్చామంటున్నారు. సమాచారం ఇస్తే సరిపోతుందా? పోలీసులు తగినంత భద్రత కల్పించకపోతే అదే సమాచారం అల్లు అర్జున్ కి తెలియచేసి అతని రాకని నిరోధించి వుండొచ్చు. ఆ పని వారు చేయలేదు. కనుక వారి మీద క్రిమినల్ చర్యలు తప్పనిసరిగా తీసుకోవాలి.

ఓ ముగ్గురిని అరెస్ట్ చేసినట్లున్నారు. పోలీసులేమో తమకి ఎలాంటి సమాచారం ఇవ్వలేదు అంటున్నారు. ఒకవేళ వారికి ముందస్తు సమాచారం ఇచ్చి వున్నా కూడా థియేటర్ యాజమాన్యం, అల్లు అర్జున్ల నైతిక బాధ్యత లేకుండా పోదు. తన భద్రతకి బాక్సర్లను పెట్టుకునే హీరో గారికి తనని చూడటానికి వచ్చే సామాన్య జనం పట్ల కన్సర్న్ వుండొద్దా? నిశ్శబ్దంగా సినిమా చూసి పోక థియేటర్లోకి వచ్చినప్పుడు తన వాహనం సన్ రూఫ్ నుండి ప్రేక్షకులకు అభివాదం చేశాడాయన. ఆయన భద్రతా సిబ్బంది దారి కోసం జనాల్ని తోసేయడంతో తొక్కిసలాట జరిగింది. భారీగా అభిమానులున్నారని, వెనక్కి వెళ్లాలని పోలీసులు చెప్పినా వినకుండా థియేటర్లోకి వెళ్లాడని పోలీసులు చెబుతున్నారు. బాధ్యత లేకుండా వ్యవహరించి నిండు ప్రాణాలు పోవడానికి కారణమైన అతన్ని ఎందుకు చట్టం నుండి మినహాయించాలి?

అల్లు అర్జున్ జాతీయ ఉత్తమ నటుడు అనే పురస్కార గ్రహీత ఐన కారణంగా ఆయన అరెస్ట్ అన్యాయం అని కొందరు వాపోతున్నారు. చట్టం ముందు ఎవరైనా ఒక్కటే. జాతీయ పురస్కార గ్రహీతలకి చట్టాల నుండి మినహాయింపులుంటాయా? ఇది చాలా అన్యాయమైన వాదన. పద్మశ్రీ పురస్కార గ్రహీత ఐన మోహన్ బాబు మీద హత్యా యత్నం కేసు పెట్టారు. జాతీయ పురస్కారం ప్రకటించబడిన జానీ మాస్టర్ కూడా కేసులు ఎదుర్కొంటున్నాడు. ఆయనకి ప్రకటించిన పురస్కారాన్ని రద్దు చేశారు. పివి నరసింహారావు అంతటివాడే కోర్టు బోనులో నిందితుడిగా నిలుచున్నారు. ఏమిటి అల్లు అర్జున్ ప్రత్యేకత, గొప్పతనమూనూ? అభిమానులలో ఉన్మాదాన్ని నింపే సంఘ విద్రోహ శక్తుల కథల్ని ఉత్తేజభరితంగా చూపించే చిల్లర హీరో పాత్రల్ని వేసే వాడేగా అల్లు అర్జున్? మోహన్‌బాబు, అల్లు అర్జున్ వంటి వారి దగ్గర నుండి పురస్కారాల్ని వెనక్కి తీసుకోవాలి. జానీ మాస్టర్ కి ఒక న్యాయం, అల్లు అర్జున్ కి ఒక న్యాయమా?

అల్లు అర్జున్‌ని అరెస్ట్ చేస్తే బీజేపీకి, బీఆరెస్, వైసీపికి ఏమిటి అభ్యంతరం? ఆ అరెస్టుని వ్యతిరేకించడం ద్వారా సమాజానికి ఏ సందేశం ఇస్తున్నారు వీళ్లు? ఎంత దుర్మార్గమైన రాజకీయ వైఖరి ఇది! ఏం సినిమా హీరోలు చట్టాలకు అతీతులని ఈ పాలక వర్గ



పార్టీల అభిప్రాయమా?

అసలెందుకు అల్లు అర్జున్ మీద సానుభూతి? ఆయనేమైనా సంఘ సేవ చేస్తున్నాడా? దేశానికి మేలు చేసే కార్యక్రమాల్లో వున్నాడా? బాలకృష్ణ "అన్ స్టాపబుల్" కార్యక్రమంలో డబ్బు మీద తన దృక్పథాన్ని ఎలా వివరించాడో మీకు గుర్తున్నదా? "నా దగ్గర డబ్బులున్నాయి కదాని ఒక పది రూపాయిల చాక్లెట్టుని వంద రూపాయిలు పెట్టి కొనను" అన్నాడాయన ఆ షోలో. కానీ అతను రెండు వందల రూపాయిల టిక్కెట్టుని పన్నెండు వందలకి అమ్ముకునే దురాశ బాచ్ కి లీడర్. అది నిర్మాతకి వెళుతుందని అమాయకంగా వాదించకండి. రిటర్న్సు లో పెద్ద హీరోలకి వాటా వుంటుంది. అందుకే తమ డొల్ల సినిమాలకి ఓవర్ హైప్ ఇచ్చే మోసగాళ్లు మన సినిమా హీరోలు! ఓ నాలుగొందల కోట్ల ఖర్చుతో తీసే సినిమాలో మూడొందల కోట్ల ఖర్చు ఆయన పారితోషికానికే అవుతుంది. ఒక సినిమా ఖర్చులో మూడొంతులు పారితోషికాలకే ఖర్చవుతుంటే అది భారీ సినిమాగా చూపించి, ప్రభుత్వ ప్రత్యేక అనుమతుల ద్వారా టికెట్ల రేట్లని నాలుగు రెట్లు ఎక్కువకి అమ్ముకునే డబ్బు పిశాచులు కాదా మన అగ్ర హీరోలు? అల్లు అర్జున్ కూడా ఆ తానులో గుడ్డముక్కే కదా!

"అసలు టికెట్ల రేట్ల మీద ప్రభుత్వానికి అజమాయిషీ వుండకూడదు. ఇష్టం వున్నవాడే చూస్తాడు. లేనివాడు మానేస్తాడు" అనీఅర్జీవి వంటి దగుల్బాజీలో లేదా హీరోల కట్టు బానిసలో వాదనలూ చేస్తుంటారు. వ్యాపారస్తుల ధనాశకి కళ్లెం వేసి సామాన్యులు దోపిడీకి గురి కాకుండా చూసే బాధ్యత ప్రభుత్వానిది. ఇది మద్యం అమ్మకాలు వంటి వ్యసన రంగానికి, సినిమా వంటి వినోద రంగానికి ఖచ్చితంగా అన్వయించాలి. సెన్సార్ బోర్డ్ ఎంత ముఖ్యమో టికెట్ల ధరల మీద నియంత్రణ కూడా అంతే ముఖ్యం. అసలు ప్రభుత్వాలు ధరలు పెంచుకోడానికి అనుమతివ్వడమే అన్యాయం. ఈ హీరోలు వచ్చే ఎన్నికల్లో తమ పార్టీలకు మద్దతివ్వక పోతారా అనే ఆలోచన ప్రభుత్వాన్ని నడిపే వారిలో వుండొచ్చు. కంటెంట్ పరంగా కాక హీరోల పారితోషికానికే డబ్బులెక్కువ ఖర్చు పెట్టి తమది భారీ బడ్జెట్టంటే ఎలా? అసలు సినిమాల ద్వారా ఏ సామాజిక ప్రయోజనానికి పూనుకుంటున్నారు ఈ భారీ బడ్జెట్ నిర్మాతలు? సినిమా వ్యాపారమే. కాదనడానికేం లేదు. కానీ అత్త సొమ్ము అల్లుడు దానం చేసినట్లు టికెట్ల అధిక రేట్ల ద్వారా జనం సొమ్ముని లూటీ చేయమని చెప్పడానికసలు ప్రభుత్వానికేం అధికారం వుంది? ఒక్క సంవత్సరం తాము పండించిన ధాన్యానికి తామే ధర నిర్ణయించుకుంటామని రైతులు అంటే ఈ ప్రభుత్వాలు ప్రత్యేక అనుమతులు ఇస్తాయా? ఈ సినిమా అధిక రేట్ల విషయమై ఎవరో హైకోర్టుకి వెళితే "అవునా? రేట్లు అంతగా పెంచారా?" అని ఆశ్చర్యపోయిన హైకోర్టు తదుపరి విచారణని ఈ నెల 17కో, 18కో వాయిదా వేసింది. అంటే అప్పటికి అధిక రేట్లు దాదాపుగా తగ్గిపోతాయి. సినిమాని కూడా చాలామంది చూసే వుంటారు. నిర్మాతలు, హీరో ప్రజల నుండి దండుకోగలిగినంత దండుకుంటారు. ఈ కేసులో కోర్ట్ వ్యవహరించిన తీరు కూడా అంతుపట్టడం లేదు. తిలా పాపం తలా పిడికెడు అన్నట్లుంది.

సినిమా రంగానికి చెందిన ప్రముఖులు డబ్బిస్తే చాలు ఎంత చెత్త సరుకుకైనా, దివాలా తీసే సంస్థకైనా ప్రచారం చేసి పెడతారు. ఎన్నో మధ్య తరగతి కుటుంబాలు వీరి మాటలు నమ్మి బోలెడంత డబ్బు, ఆస్తి కోల్పోయి బికారులయ్యారు. ఉదాహరణకు మహేష్ బాబు ప్రచారం చేసిన విజయవాడ దగ్గరలోని రియల్ ఎస్టేట్ వెంచర్ రామకృష్ణ వెనూజియాలో 40, 50, 60 లక్షల పెట్టుబడులు పెట్టి తమ కుటుంబాల్ని కొల్లేరు చేసుకున్న వారు వందలమంది వున్నారు. డైరెక్టర్ కె.విశ్వనాథ్, ఎస్పి బాలసుబ్రహ్మణ్యం విపరీతంగా ప్రచారం చేసిన ఓ స్థిరాస్థి సంస్థ వల్ల కూడా ప్రజలు నష్టపోయారట. ఇవి మచ్చుకి కొన్ని ఉదాహరణలే. ప్రభుత్వం హీరోల దురాశని కట్టడి చేసేందుకు పూనుకోవాలి. తాము ప్రచారం చేసిన ఉత్పత్తులకు, సంస్థలకు తామే పూచీపడేలా చేయాలి. తమ ప్రచారం వల్ల ప్రజలు నష్టపోతే ఈ హీరోల్ని బాధ్యుల్ని చేయాలి.

**- అరణ్యక్రిష్ణ**

# విప్లవ సాంస్కృతికోద్యమ యోధుడు 'పాణిగ్రాహి'

## - 55వ స్మారక సభకు తరలిరండి - కరపత్రావిష్కరణలో విప్లవ ప్రజా సంఘాల పిలుపు




(సత్యంన్యూస్, శ్రీకాకుళం)


విప్లవ సాంస్కృతికోద్యమ యోధుడు కామ్రేడ్ సుబ్బారావు పాణిగ్రాహి అమరత్వానికి యాభై ఐదేళ్ళు పూర్తవుతున్న సందర్భంగా 'పాణిగ్రాహి పోరాట జీవితం – వర్తమాన ప్రాసంగికత – ప్రాధాన్యం' అంశంపై విప్లవ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఈనెల 22న ఉదయం 10గంటలకు శ్రీకాకుళందరి పెద్దపాడు వానవానిపేటలో 'పాణిగ్రాహి' స్మారక బహిరంగను నిర్వహిస్తున్నట్టు అరుణోదయ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నశెట్టి రాజశేఖర్ తెలిపారు. ఈ సభకు పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఏడు విప్లవ ప్రజా సంఘాల పక్షాన ఆయన పిలుపునిచ్చారు. ఏఐకెయంయస్, ఐఎఫ్‌టియు, పీవోడబ్ల్యు, అరుణోదయ, పీవైయల్, పీడీయస్‌యు, ప్రగతిశీల దళిత వేదిక సంస్థలు ఉమ్మడిగా ఈ సభా నిర్వహణ బాధ్యతను వహిస్తున్నాయని చెప్పారు. శనివారం ఉదయం శ్రీకాకుళం కార్పొరేషన్ పరిధిలోని తంగివానిపేటలో పాణిగ్రాహి వర్ధంతి సభకు సంబంధించిన కరత్ర ఆవిష్కరణ కార్యక్రమంలో సన్నశెట్టి పాల్గొని మాట్లాడారు. విప్లవస్ఫూర్తితో చరిత్రలో శాశ్వతంగా నిలిచిపోయిన శ్రీకాకుళ సాయుధ గిరిజన రైతాంగ పోరాటంలో సుబ్బారావు పాణిగ్రాహి ఆటా, పాటా, మాటా తూటాలై పేలి విప్లవ పోరాట చరిత్రగా నిలిచిపోయిందన్నారు. పెన్నూ, గన్నూ ఏకం చేసి, విప్లవించిన ధీరుడు పాణిగ్రాహి అని అన్నారు. ప్రజాకవిగా, ప్రజా కళాకారునిగా, విప్లవ సాంస్కృతికోద్యమ యోధునిగా వీరోచిత కర్తవ్యంతో పాణిగ్రాహి పోరాటంలో ధ్రువతారగా నిలిచారన్నారు. ఏఐకెయంయస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి తాండ్ర ప్రకాష్ మాట్లాడుతూ శ్రీకాకుళ విప్లవోద్యమం మీద రాజ్యం నిర్బంధాన్ని ప్రయోగించినప్పుడు, తన భుజాన జముకును వేసుకొని రాష్ట్ర వ్యాప్తంగా జముకుల కథను ప్రదర్శించి ప్రజల మద్దతును కూడగట్టిన పోరు ధీరుడు పాణిగ్రాహి అని కొనియాడారు. 1969 డిసెంబరు 22న మందస దరి రంగోమె టియా కొండల్లో సుబ్బారావు పాణిగ్రాహిని బూటకపు ఎన్‌కౌంటర్‌లో అప్పటి కాంగ్రెస్ నియంత పాలకులు అమానుషంగా కాల్చి చంపారనీ పాణిగ్రాహితో పాటు నిర్మల, ఉమా రావ్, రమేష్‌చంద్ర, అంకమ్మ, సరస్వతి ఆరోజునే (1969 డిసెంబర్ 22న) అమరత్వం చెందిన విప్లవ పోరాట ధ్రువతారలయ్యారని తెలిపారు. నేడు పాణిగ్రాహితో సహా ఆరుగురు విప్లవ యోధుల అమరత్వానికి యాభై ఐదేళ్లు కావస్తున్న సందర్భంగా స్మారక సభను నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ప్రజలతోపాటు పీవో డబ్ల్యు శ్రీకాకుళం జిల్లా అధ్యక్షు రాలు సవలాపురపు కృష్ణవేణి, ప్రగతి శీల దళిత వేదిక జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి.అప్పారావు, బి.బాలు, వానవానిపేట పూలే అంబేద్కర్ కాలనీ కమిటీ నాయకులు మురళి, యస్.ఆర్. శేఖర్‌లు పాల్గొన్నారు.

# స్వదేశానికి చేరుకోనున్న సిక్కోలు మత్స్యకారులు

**- 6 నెలల క్రితం జిల్లా నుంచి చెన్నైకి వలస వెళ్లిన ఇద్దరు గంగపుత్రులు**

**- వేటకు వెళ్లి, అనుకోకుండా శ్రీలంక సముద్ర జలాల్లోకి చేరుకోవడంతో అరెస్ట్ చేసిన కోస్టుగార్డు పోలీసులు**

**- విదేశాంగ శాఖతో కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు సంప్రదింపుల అనంతరం విడుదలకు అంగీకరించిన శ్రీలంక ప్రభుత్వం**



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)





అనుకోకుండా శ్రీలంక సముద్ర జలాల్లోకి ప్రవేశించి, గత 6 నెలలుగా అక్కడి జైల్లో మగ్గుతున్న జిల్లాకు చెందిన మత్స్యకారులు తిరిగి స్వదేశానికి చేరుకున్నారు. ఈ మేరకు శ్రీలంకలోని భారత ఎంబసీ కార్యాలయం నుంచి కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి, ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు కార్యాలయానికి శుక్రవారం సమాచారం అందించారు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. శ్రీకాకుళం రూరల్ మండలం పెదగనగళ్లవానిపేటకు చెందిన మత్స్యకార యువకులు దాసరి వెంకయ్య(35), గనగళ్ల కొర్లయ్య (33) ఉపాధి నిమిత్తం జూన్ 7న చెన్నై కి వలస వెళ్లారు. అక్కడి నుంచి జూన్ 25న మొత్తం 8మంది కలిసి, బోటులో సముద్రంలోకి వేటకు వెళ్లారు. అయితే సరిహద్దులు తెలియక శ్రీలంక సముద్ర జలాల్లోకి ప్రవేశించడం, ప్రమాదవశాత్తు మరో బోటును ఢీ కొట్టడంతో అక్కడి కోస్టుగార్డు పోలీసులు అరెస్టు చేశారు. దీనిపై 15 రోజుల తరువాత కర్ణాటకకు చెందిన మత్స్యకార సంఘానికి విషయం తెలియగా.. వారు బాధిత కుటుంబాలకు సమాచారం అందించారు. దీంతో స్థానిక నాయకులు, శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ తదితరులు కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు దృష్టికి సమస్యను తీసుకు వెళ్లారు.

**విదేశాంగ శాఖతో రామ్మోహన్ నాయుడు సంప్రదింపులు..**

జిల్లాకు చెందిన ఇద్దరు మత్స్యకారులు అనుకోకుండా శ్రీలంక కోస్టు గార్డుకు చిక్కు కోవడంతో కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, ఎమ్మెల్యే గొండు శంకర్ వెంటనే స్పందించారు. బాధిత కుటుంబాలకు బియ్యం, రేషన్ సరుకులు అందజేశారు. అలాగే విదేశాంగ శాఖ మంత్రి ఎన్.జైశంకర్‌ను కలిసి, మత్స్యకారులను స్వదేశానికి చేరుకునేలా చొరవ చూపాలని కోరారు. అలాగే భారత ఎంబసీకి సమాచారం అందిం చారు. ఈమేరకు జరిగిన సంప్రదింపులు కొలిక్కి రావడంతో.. గంగపుత్రులను విడుదల చేసేందుకు ప్రభుత్వం అంగీకరించింది. కోర్టులో న్యాయ ప్రక్రియ పూర్తయిన కొద్ది రోజుల్లోనే మత్స్యకారులను ముందుగా కొలంబోకు, అక్కడి నుంచి విమానంలో స్వదేశానికి చేర్చనున్నట్లు సమాచారం అందించారు. దీనిపై చొరవ చూపిన కేంద్ర పౌర విమాన యాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు, విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్, ఎమ్మెల్యే గొండు శంకర్ లకు కృతజ్ఞతలు తెలియజేశారు.
















# శర్వాణిలో ప్రాజెక్ట్ డే



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

అరసవల్లిలోని శర్వాణి విద్యాలయలో అధినేత అంధవరపు సూరిబాబు ఆధ్వర్యంలో గురజాడ విద్యాసంస్థల అధినేత జి.స్వామి నాయుడు కుమార్తె, గాయత్రి విద్యాసంస్థల ప్రతినిధి జి.సంయుక్త ఘనంగా ప్రాజెక్టు డే ప్రారంభించారు. కరస్పాండెంట్ ఆంజనేయులు, హెడ్మిస్ట్రెస్ డాక్టర్ కె.రేఖ, అకడమిక్ అడ్వయిజర్, ప్రముఖ విద్యావేత్త బలివాడ మల్లేశ్వరరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు విద్యార్థుల తల్లిదండ్రులు ఉత్సాహంగా పాల్గొన్నారు. దీనిలో భాగంగా విద్యార్థులు వివిధ శాస్త్రాలకు, వివిధ భాషలకు చెందిన ప్రాజెక్టులను ప్రదర్శించి అందరినీ అకట్టుకున్నారు. ఈ సందర్భంగా బలివాడ మల్లేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థి సృజనాత్మకత, కమ్యూనికేషన్ స్కిల్స్ అద్భుతంగా ఉన్నాయని, తెలుగు, ఇంగ్లీషు, హిందీల్లో భాషా పటిమ గొప్పగా ఉందని కొనియాడారు. సంయుక్త మాట్లాడుతూ విద్యార్థులు ప్రతి అంశంలో పరిపూర్ణ అవగాహనతో భాష పట్ల విశిష్ఠత, వేద స్వరూపాలు, భగవద్గీత, పూర్వ సంప్రదాయాలను గుర్తు చేశారు. సూరిబాబు మాట్లాడుతూ ఇటువంటి విశిష్ట కార్యక్రమాల ద్వారా విద్యార్థికి సర్వతోముఖవికాసాన్ని కలిగించడంతో పాటు డ్యాన్స్, యోగా, కరాటే, మ్యూజిక్లకు ప్రత్యేక నిపుణులతో బోధించడం శర్వాణి ప్రత్యేకతన్నారు. హెడ్మిస్ట్రెస్ రేఖ మాట్లాడుతూ సంస్థ అధినేత సూరిబాబు ఆశయాలకు అనుగుణంగా ఉపాధ్యాయుల సౌజన్యంతో ప్రతి కార్యక్రమం విద్యార్థుల ఉజ్జ్వల భవిష్యత్తుకు రూపొందిస్తున్నట్టు తెలిపారు.

## 16న ఎస్సీ ఉప వర్గీకరణ కమిషన్ పర్యటన

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నియమించిన షెడ్యూల్డ్ కులాల ఉప వర్గీకరణ కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా ఈ నెల 16న జిల్లాలో పర్యటించనున్నారు. ఈ మేరకు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. కమిషన్ చైర్మన్ 16న ఉదయం 10గంటలకు జిల్లాకు చేరుకొని, 11గంటల నుంచి 2 గంటల వరకు కలెక్టరేట్‌లో జిల్లా అధికారులతో సమావేశమవుతారు. తర్వాత దళిత కులాలకు చెందిన ఉద్యోగులు, కులసంఘ నాయకులు, ప్రజల నుండి వినతులు స్వీకరిస్తారు. షెడ్యూల్డ్ కులాల ఉప వర్గీకరణపై తమ అభిప్రాయాలు, సూచనలు తెలియజేయాలనుకునేవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# బొద్దూరు విద్యార్థులకు జాతీయ ప్రశంసా పత్రాలు

(సత్యంన్యూస్, సంతకవిటి)

బొద్దూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న వల్లూరు కిరణ్మయి, నాగలక్ష్మి, మహేశ్వరి, గౌతమి, రమ్యలు జాతీయ పాఠశాల నవ కల్పన ప్రాజెక్ట్ 2024-25లో పాల్గొని జాతీయ ప్రాజెక్టు అధికారుల నుంచి ప్రశంసా పత్రాలు పొందారు. వీరు ఇంటి పెరడులో నేలవేము, తిప్పతీగ, మునగ వంటి చిన్న మొక్కలు పెంచి వాటి భాగాలను ఉపయోగించి అధిక శాతం ప్రజలను పీడిస్తున్న వ్యాధులు బీపీ, మధుమేహం, కాలేయ వ్యాధులను సులభంగా తగ్గించుకోవచ్చన్నారు. అలాగే ఐరన్ డెఫిషియన్సీ, కాల్షియం లోపాలను కూడా తగ్గించుకొని ఆరోగ్యమైన జీవితాన్ని గడపవచ్చని చెప్పారు. ప్లాస్టిక్ వినియోగం క్యాన్సర్ కారకంగా ఉందని, దానిని నుంచి మానవాళిని రక్షించుకోవడానికి ప్రత్యామ్నాయాలను చూపారు. ప్లాస్టిక్ పేపర్ భోజన ప్లేట్లకు బదులుగా అరటి బెరడుతో తయారు చేసిన భోజన ప్లేట్లు, ప్లాస్టిక్ ప్యాకింగ్ కవర్లలకు బదులు అరటి బెరడుతో చేసిన ప్యాకింగ్ ఉపయోగించి ఆరోగ్యకరమైన జీవితాన్ని ఆరోగ్యకరమైన పరిసరాలను సృష్టించుకోవచ్చని ప్రాజెక్టును సమర్పించారు. ఈ విద్యార్థులతో పాటు వీరికి మార్గదర్శకత్వం వహించిన ఆంగ్ల ఉపాధ్యాయులు అదపాక దామోదరావుకు ప్రసాద్ ప్రశంసా పత్రాన్ని బహుకరించారు. వీరిని



పాఠశాల ప్రధానోపాధ్యాయులు మల్లేశ్వరరావు, మండల విద్యాశాఖ అధికారులు శాంతికుమారి, భాస్కరరావు, ఇతర ఉపాధ్యాయులు అభినందించారు.


# రిమ్స్ అన్నపూర్ణకు రూ.10వేలు విరాళం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

భగవాన్ శ్రీ సత్యసాయి బాబా సేవాసంఘం రాష్ట్ర అధ్యక్షులు రఘుపాత్రుని లక్ష్మణరావు సారథ్యంలో శ్రీకాకుళం పట్టణ కేంద్రం రిమ్స్ ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులు, సహాయకులకు నిర్వహిస్తున్న నిత్య అన్నపూర్ణ సేవకు పట్టణానికి చెందిన కీర్తిశేషులు డాక్టర్ లోకనాథం సూర్యలింగం కుమారుడు రామారావు తన పుట్టినరోజు సందర్భంగా రూ.10వేలు విరాళాన్ని ట్రస్ట్ అధ్యక్షులు గంగుల రమణ బాబుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు సూర రామచంద్రరావు ట్రస్ట్ సెక్రటరీ కిల్లాన ఫల్గుణరావు పాల్గొన్నారు.



## శ్రీరామకృష్ణ బోధనలు ప్రపంచానికి ఆదర్శం




(సత్యంన్యూస్, పలాస)

శ్రీరామకృష్ణ పరమహంస బోధనలు ప్రపంచ మానవాళికి ఆదర్శవంతమైనవని విశాఖపట్నం శ్రీరామకృష్ణ మిషన్ ఆశ్రమ కార్యదర్శి స్వసం వేద్యానంద స్వామీజీ అన్నారు. ఉత్తరాంధ్ర రామకృష్ణ వివేకానంద భావ ప్రచార పరిషత్ సౌజన్యంతో శ్రీ రామకృష్ణ సేవాసమితి (పలాస- మంచినీళ్లపేట) సారథ్యంలో పలాస పట్టణంలో నిర్వహించిన మూడు రోజుల భక్తి సమ్మేళనంలో ఆయన అధ్యక్షత ప్రసంగం చేశారు. తొలుత శ్రీరామకృష్ణ, శారద, వివేకానందమూర్తి త్రయానికి జ్యోతిప్రజ్వలన, పుష్పాభిషేకం చేశారు. అనంతరం పూజ్య స్వామీజీలు మాట్లాడుతూ మనకు దైవం పట్ల భక్తి, దేశం పట్ల భక్తి రెండూ ప్రధానమేనన్నారు. భక్తితో భగవంతుని ఆరాధించడం, ప్రేమతో సాటివారికి సేవ చేయడం మానవ ధర్మమని పేర్కొన్నారు. సభలో జీవన్ బెహరా శ్రీరామకృష్ణ సేవాసమితుల కార్యక్రమాలను వివరించారు. కన్వీనర్ ఎస్.విశ్వనాథం వార్షిక నివేదిక సమర్పించారు. కార్యక్రమంలో స్వామీజీలు పరిజ్ఞేయానంద, సేవ్యానంద, కృష్ణ సంఖానంద, వేద ప్రియానంద, గీత సారానంద, యజ్ఞపురుషానంద, కె.మహాలక్ష్మి, స్వామీజీలు, భక్తులు, మంత్రదీక్షితులు, అధిక సంఖ్యలో మహిళా భక్తులు పాల్గొన్నారు.

## నైపుణ్యం, ఆత్మవిశ్వాసంతో అన్ని రంగాల్లో రాణించండి

(సత్యంన్యూస్, బూర్జ)

విద్యార్థులు ఆత్మవిశ్వాసం, నైపుణ్యాభివృద్ధి సాధిస్తే అన్ని రంగాల్లోనూ రాణిస్తారని పెద్దపేట ఆర్ట్స్ సంస్థ డైరెక్టర్ నూక సన్యాసిరావు అన్నారు. వృత్తి విద్యను అభ్యసించే విద్యార్థులు నైపుణ్యాల విషయంలో మరింత దృష్టి సారించాలన్నారు. స్వచ్ఛంద సంస్థలు ప్రత్యక్షంగాను, పరోక్షంగాను అనేక సేవా కార్యక్రమాల ద్వారా తమ ప్రత్యేకతను చాటుతున్నాయనీ తెలిపారు. ఆన్ ది జాబ్ ట్రైనింగ్‌లో భాగంగా ప్రభుత్వ జూనియర్ కళాశాల నరసన్నపేట ఒకేషనల్ విద్యార్థులకు ఆర్ట్స్ సంస్థలో ప్రత్యేక అవగాహన కల్పించారు. నరసన్నపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సురవరపు సత్యనారాయణ సూచనలతో ఒకేషనల్ విద్యార్థులకు ఒకరోజు ఓజేటీ కార్యక్రమం నిర్వహించామనీ అధ్యాపకులు దుగ్గివలస రాంప్రసాద్, కొర్రాయి రవి పేర్కొన్నారు. అనంతరం వ్యవసాయం, వాటి అనుబంధ పంటలు, చిన్న తరహా పరిశ్రమల స్థాపన, చిరుధాన్యాలు, అగ్రికెమ్, మార్కెటింగ్ వంటి రంగాలలో ఉన్న ఉపాధి అవకాశాలపై సంస్థ ఎండీ నూక అనూప్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రభుత్వం అందిస్తోన్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ శిక్షణలో అధ్యాపకులు రాంప్రసాద్, రవి ఆర్ట్స్ సంస్థ సిబ్బంది పెద్దపాటి బాలు, కురమాన సురేష్ పాల్గొన్నారు.




# ఇంధన పొదుపుగా వాడాలి




(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఇంధనాన్ని పొదుపుగా వాడటం ద్వారా భవిష్యత్తులో దేశానికి విద్యుత్తు సమస్య లేకుండా చేయవచ్చని శ్రీకాకుళం జిల్లా తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ పర్యవేక్షక ఇంజినీర్ నాగిరెడ్డి కృష్ణమూర్తి అన్నారు. జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలలో భాగంగా శనివారం జిల్లాపరిషత్ నుంచి పొట్టి శ్రీరాములు కూడలి మీదుగా మున్సిపల్ కార్యాలయం వరకూ విద్యుత్ ఉద్యోగులు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని ఎస్ఈ ప్రారంభించి అనంతరం మాట్లాడుతూ ఇంధనాన్ని పొదుపు చేయాల్సిన ఆవశ్యకతను వివరించారు. రోజురోజుకూ దేశంలో విద్యుత్ వినియోగం పెరిగిపోతోందని, దీనిని తగ్గించే ఉద్దేశ్యంతో సంప్రదాయేతర ఇంధన వినియోగాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రోత్సహిస్తున్నట్లు చెప్పారు. మహోద్యమంగా విద్యుత్ వినియోగాన్ని తగ్గించాల్సిన అవసరం ఉందన్నారు. భవిష్యత్ తరాల కోసం ఇంధనాన్ని పొదుపు చేయాల్సిన బాధ్యత ప్రతీ పౌరునిపైనా ఉందని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఏపీఈపీడీసీఎల్ ఈఈలు సురేష్ కుమార్, యోగేశ్వరరావు, భయన్నాయుడు, ఆనంద్, డీఈలు, ఏఈలు, ఇతర సిబ్బంది, వినియోగదారుల సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

# జిల్లాలో సజావుగా నీటి సంఘాల ఎన్నికలు

**రాజీప్రయత్నాలతో పదవులు సర్దుబాటు । దాదాపు అన్ని చోట్ల ఏకగ్రీవం**



(సత్యంన్యూస్, కొత్తూరు)

సుదీర్ఘ కాలం తర్వాత నీటి సంఘాల ఎన్నికలు జరగడంతో కూటమి నాయకులు అన్నీ తామై వ్యవహరించి 90 శాతానికి పైగా ఏకగ్రీవం చేసుకున్నారు. మరికొన్ని చోట్ల కూటమి నాయకుల మధ్య పోటీ పడగా రంగంలోకి దిగిన ఎమ్మెల్యేలు సర్దిచెప్పి ఏకగ్రీవం చేయించారు. జిల్లాలోని 30 మండలాల పరిధిలో 344 చిన్న, మధ్య, భారీ నీటి సంఘాలకు శనివారం నిర్వహించారు. మొత్తం 4,57,900 మంది ఓటర్లుగా ఉన్న 344 నీటి సంఘం కమిటీలో సభ్యులుగా ఎవరు ఉండాలన్న దానిపై గ్రామ స్థాయిలోనే కూటమి నాయకులు నిర్ణయించి నామినేషన్లు దాఖలు చేయించారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమైన ఎంపికప్రకియ 12.30 గంటలకు పూర్తయింది. ముందుగా నిర్ణయించిన మేరకు దాదాపు అన్నిచోట్లా ఏకగ్రీవమయ్యాయి. నామినేషన్లు వేసిన చోట రాజీ ప్రయత్నాలు చేశారు. పోటీ ఉన్నా చేతులెత్తి చూపడం ద్వారా సభ్యులు ఎంపిక చేశారు. ఆయా కమిటీలకు అధ్యక్ష, ఉపాధ్యక్షులు ఎంపికకు ప్రత్యేక సమావేశం ఏర్పాటుచేసి ఎన్నుకున్నారు. ఎన్నికలకు వైకాపా దూరంగా ఉండాలని నిర్ణయించడంతో దాదాపు అన్ని చోట్ల ఏకగ్రీవం అవుతుందని ఆశించిన కొన్ని చోట్ల టీడీపీకి స్థానిక రైతుల నుంచి పోటీ ఎదుర్కోక తప్పలేదు. మరికొన్ని చోట్ల టీడీపీ నాయకుల మధ్య పోటీ ఎదురైంది. పాతపట్నం నియోజకవర్గంలోని ఐదు మండలాలకు సంబంధించి మైనర్ నీటి సంఘాలు 24, టీసీలు 426 ఉన్నాయి, మేజర్ సంఘాలు 5, టీసీలు 60 ఉన్నాయి. మొత్తం 76 సంఘాలు 502 టీసీలకు సంబంధించిన ఎన్నికలను శనివారం నిర్వహించారు. కొత్తూరు మండలంలో వైకాపా పోటీ నుంచి తప్పుకుంది. టీడీపీ నాయకుల మధ్యే పోటీ ఎదుర్కోవాలసి వచ్చింది. కొత్తూరు మండల కేంద్రంలో టీడీపీ సీనియర్ నాయకులు పెద్ది కులశేఖర్ ఆల్వార్, రైతు సరిపిల్లి నాగభూషణం పోటీపడ్డారు. ఈ పోటీలో రైతు నాగభూషణం గెలుపొందడం చర్చనీయాంశమైంది. టీడీపీ నాయకుడిగా చలామణి అవుతున్న కులశేఖర్‌ను రైతులెవరూ ప్రతిపాదించకపోవడం శోచనీయం. బమ్మిడి గ్రామంలో సీనియర్ టీడీపీ కార్యకర్త ప్రతాప్, సీనియర్ టీడీపీ నాయకులు కోటి వర్గాల మధ్య పోటీ ఏర్పడింది. చివరి నిమిషంలో ప్రతాప్ వర్గానికి ఒకకమిటీ మెంబర్‌ను ఇచ్చి కోటి వర్గానికి చైర్మన్ పదవి ఇచ్చి రాజీ కుదిర్చారు. జిల్లా వ్యాప్తంగా ఇదే పరిస్థితిని టీటీపీ నాయకులకు ఎదురైనా చివరి నిమిషంలో రాజీ మార్గం ద్వారా పదవులు సర్దుబాటు చేయడంతో ఎన్నికలు సజావుగా ముగిసాయి.

# ఎవర్రా మీరంతా..?!



(మొదటిపేజీ తరువాయి)

**మెళియాపుట్టి నిందితుల చరిత్ర ఇది..**

శుక్రవారం మెళియాపుట్టి కేసులో ఏ-2గా ఉన్న శంకరరెడ్డి గతంలో పలాస దొరికిన నకిలీ నోట్ల ముఠాలో కీలక నిందితుడే. కాయిన్స్, బ్లాక్‌కరెన్సీ పేరుతో రాజమండ్రి, విజయనగరంలో పలువురిని మోసం చేసినట్టు కేసులు నమోదయ్యాయి. మిగతావారిపై కూడా క్రిమినల్ కేసులు ఉన్నాయి. శంకర్‌రెడ్డి పలాస కేంద్రంగా నకిలీ నోట్లు చలామణి చేస్తున్నట్టు పోలీసులకు మొదటి నుంచి అనుమానం ఉన్నా ఆయనపై నిఘా పెట్టడంలో గత అధికారులు విఫలమయ్యారు. ఇప్పటికీ పలాస కేంద్రంగా ఫేక్ కరెన్సీ చలామణి అవుతుందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. పోలీసులు ఉదాసీనంగా వ్యవహరించడం, రాజకీయ ప్రలోభాలకు తలొగ్గడంతో గతంలో నకిలీ నోట్లు చలామణి చేసినట్టు విచారణలో పోలీసులు గుర్తించినా చర్యలు తీసుకోలేకపోయారు. శుక్రవారం అరెస్టు అయిన వారి వెనుక మరింత మంది ఉన్నారని ఊహగానాలు వినిపిస్తున్నాయి. దీన్ని నిజం చేస్తూ ఈ రెండు కేసుల్లో మరి కొంత మందిని అరెస్టు చేయాల్సి ఉందని పోలీసులు ప్రకటించారు.

**జి.సిగడాం బాబుల చరిత్ర ఇది**

జి.సిగడాంలో రూ.15లక్షలు నకిలీనోట్లను కారులో తరలిస్తుండగా పట్టుబడిన ఎన్ని రాజేష్, గనగళ్ల రవికుమార్‌ల చరిత్ర ఘనమైనదే. రాజేష్ ఒక పత్రికకు విలేకరిగా, నేషనల్ హ్యూమన్‌రైట్స్ కౌన్సిల్ అనే ఒక పెట్టుడు సంస్థకు జిల్లా అధ్యక్షుడిగా చెప్పుకుంటూ చేసిన దందాలు అనేకం ఉన్నాయి. నగరంలో ఎక్కడ తట్టెడు ఇసుక కనిపించినా నిర్మాణాలేవో జరుగుతున్నాయని వెళ్లి యజమానులను బెదిరించి సొమ్ములు తీసుకోవడంలో మనోడు సిద్ధహస్తుడు. దీనికి తోడు హ్యూమన్‌రైట్స్ కౌన్సిల్ అనే ఒక ఐడెంటిటీ కార్డు కూడా మెడలో వేళాడుతుండటంతో విలేకరి ప్లస్ హ్యూమన్‌రైట్స్ మరింత పవర్‌ఫుల్ అని చెప్పి ఎంతోమందిని బ్లాక్‌మెయిల్ చేసి దండుకున్న చరిత్ర ఇప్పుడు పోలీసులు తవ్వుతున్నారు. ఇక మరో నిందితుడు గనగళ్ల రవికుమార్ డీఆర్‌డీఏలో ఉద్యోగం చేస్తూ మహిళా స్వయం శక్తి సంఘాల పొదుపు సొమ్ములను కాజేశాడు. దీనిపై ఎచ్చెర్లకు చెందిన పలు సంఘాలు గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేయడంతో రవికుమార్ విధుల నుంచి సస్పెండ్ చేసి డబ్బులు రికవరీ చేశారు. ఆ తర్వాత కోవిడ్‌లో టిడ్కో క్వారంటీన్ కేంద్రానికి ఇన్‌చార్జ్‌గా వ్యవహరించి ఈ కేంద్రాలకు ఆహారం సరఫరా చేసే హోటల్స్ యజమానులతో కలిసి అడ్డగోలుగా వ్యవహరించాడన్న ఆరోపణలు ఉన్నాయి. అప్పటి ఉన్నతాధికారులను మంచి చేసుకొని సీతంపేట మండలానికి బదిలీపై వెళ్లిపోయాడు. ఆతర్వాత అక్కడ విధులకు హాజరుకాకుండా, కాజేసిన డబ్బులు కట్టకుండా వ్యవహరిస్తుండడంతో రవికుమార్‌ను విధుల నుంచి తొలగించారు. ఆతర్వాత మీడియా పేరుతో దందాలు చేస్తున్న వారితో సంబంధాలు పెట్టుకొని నకిలీ నోట్లు ముద్రణ, చలామణిపై ఒడిశాలో పలు ప్రాంతాలు తిరిగి కొన్ని నకిలీ నోట్లను చలామణి చేశారు.

**రాజోలులో ముఠా గుట్టురట్టు**

నకిలీ కరెన్సీ రూ.500 నోట్లతో మోసగించిన 12 మంది ముఠాను అరెస్ట్ చేసి, దానికి వినియోగించే పరికరాలు స్వాధీనం చేసుకున్నట్లు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎస్పీ కృష్ణారావు పేర్కొన్నారు. కృష్ణాజిల్లా హనుమాన్ జంక్షన్ సమీపంలోని వీరవల్లి కేంద్రంగా నకిలీ కరెన్సీని ముద్రిస్తూ లావాదేవీలు సాగిస్తున్నారు. నిందితుల వద్ద నుంచి రూ.500 దొంగనోట్లు 266, వారు ఉపయోగించిన ప్రింటర్లు, ల్యాప్‌టాప్, మొబైల్ ఫోన్లు, ఇతర పరికరాలను రాజోలు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నవంబరు 30న రాజోలులో ఏక్సిస్ బ్యాంకు ఏటీఎంలో ఒక వ్యక్తి రూ.500 నోట్లు 100 డిపాజిట్ చేశాడు. అవి నకిలీనోట్లని గుర్తించిన బ్రాంచ్ మేనేజర్ రాజోలు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్ఐ రాజేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. రాజోలు మండలం తాటిపాక మఠంకు చెందిన పాస్టర్ కోళ్ల వీరవెంకటసత్యనారాయణ డిపాజిట్ చేసినట్లు గుర్తించి అతనిని పట్టుకుని విచారణ చేయగా.. నకిలీ కరెన్సీ చలామణి చేసేవారు ఒక్కొక్కరు బయటకు వచ్చారు. నర్సాపురానికి చెందిన రాపాక ప్రభాకర్ భీమవరం లాడ్జిలో ఉన్నాడని తెలుసుకొని అక్కడ మాటువేసి పట్టుకున్న తర్వాత అటు నర్సాపురంలో గాని, ఇటు భీమవరంలో గానీ ఎవరికీ ఎటువంటి అనుమానం రాలేదు. కృష్ణారావు కోసం రాజమండ్రిలో గాలిస్తున్నప్పుడే ఎక్కడో ఇది లీకైంది. అందుకే రాజమండ్రి వీఎల్ పురం దగ్గరకు వచ్చేసరికి శ్రీకాకుళం పోలీసుల మీద అర్థరాత్రి 12.30 సమయంలో 25 మంది రెండు కార్లు, నాలుగు ద్విచక్ర వాహనాలతో వెంబడించి దాడికి దిగడం వెనుక మాస్టర్ మైండ్ వేరేగా ఉన్నట్టు అనుమానాలు వస్తున్నాయి.



Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.